క్లుప్తంగా

రుణమాఫీ కాకపోతే దరఖాస్తు చేసుకోండి

నేలకొండపల్లి: రాష్ట్రప్రభుత్వం రైతుల రుణాలను రూ. 2 లక్షల మేరా మాఫీ చేయగా ఇంకా పలువురు తమకు వర్తించలేదని చెబుతున్నారు. వీరితో పాటు రూ.2 లక్షలకు పైగా రుణాల ఉన్న వారి సందేహాలను నివృత్తి చేసేందుకు మండల స్థాయిలో సహాయ కేంద్రాలను ఏర్పాటు చేసి ఏఓలను నోడల్ అధికారులుగా నియమించారు. ఆధార్‌కార్డు, బ్యాంక్ ఖాతాలో పేర్లు తేడా ఉండడం, వినియోగంలో లేని బ్యాంక్ ఖాతా, పట్టాదారు పాసు పుస్తకం వివరాలు నమోదు కాకపోవడం, ఆధార్ నంబర్ తప్పుగా ఉండడం , కుటుంబ నిర్ధారణ లేకపోవడం, కటాఫ్ తేదీలోగా బ్యాంక్ లో రుణం లేకపోవడమేకాక రేషన్‌కార్డు లేకుండా రుణమాఫీ వర్తించని రైతులు పట్టాదారు పాసు పుస్తకం, బ్యాంక్ ఖాతా, జిరాక్స్‌లు జత చేసి తెల్ల కాగితంపై వివరాలు రాసి రైతు వేదిక, ఏఓ కార్యాలయాల్లో అందించాలని కూసుమంచి ఏడీఏ బి.సరిత సూచించారు. కాగా, అధికారులుగా నేలకొండపల్లి మండలానికి ఎం.ప్రసాద్ (7288894220), కూసుమంచికి ఆర్.వాణి(7288894221), ఖమ్మం రూరల్‌కు ఉమానగేష్(7288894222), తిరుమలాయపాలెం మండలానికి సీతారాంరెడ్డి (72888 94223)ని నోడల్ అధికారులుగా నియమించినట్లు తెలిపారు.

సెక్స్ వర్కర్లకు సమాన హక్కులు

ఖమ్మం లీగల్: సుప్రీంకోర్టు బుద్ధదేవ్ కర్మాకర్ కేసులో వివరించినట్లుగా సెక్స్ వర్కర్లకు కూడా అందరితో పాటే సమాన హక్కులు ఉంటాయని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చీఫ్ లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ హన్మంతరావు తెలిపారు. జనని స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యాన ఖమ్మంలో శనివారం ఏర్పాటుచేసిన సదస్సులో ఆయన మాట్లాడారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు, పీటా చట్టంలో ముఖ్యాంశాలను వివరించిన ఆయన సెక్స్ వర్కర్లకు సైతం చట్టసమానత్వం, గౌరవంగా జీవించే హక్కు ఉందని తెలిపారు. న్యాయవాదులు శ్రీలక్ష్మి, లలిత, వెంకటేశ్వర్లు, గంగాధర్‌తో పాటు కొత్త సమాధానం, వీణ, రచన తదితరులు పాల్గొన్నారు.

బౌద్ధక్షేత్రంలో శాశ్వత సిబ్బందిని నియమించాలి

నేలకొండపల్లి: బౌద్ధక్షేత్రంలో శాశ్వత సిబ్బందిని నియమించాలని గౌతమ్ బుద్ధ చక్రవర్తి సొసైటీ అధ్యక్షుడు కట్టికోల వెంకటేశ్వర్లు కలెక్టర్‌ను కోరారు. మండల కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బౌద్ధక్షేత్రంలో కొంతమంది ఇంకా రాజకీయ పెత్తనం చెలాయిస్తున్నారన్నారు. ఇటీవల బుద్ధ పౌర్ణమి వేడుకలు నిర్వహించేందుకు కమిటీ ప్రతినిధులు వెళ్తే పనిచేసే వారు దురుసుగా ప్రవర్తించారన్నారు. కనీసం గేటు తాళాలు తీయమని అడిగితే కూడ తీయటం లేదన్నారు. బౌద్ధక్షేత్రంపై సమగ్రంగా విచారణ నిర్వహించి చర్యలు తీసుకోవాలని కోరారు.

బాల సాహిత్య కార్యశాల

ఖమ్మం అర్బన్: నగరంలోని రోటరీనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బాలసాహిత్య వేదిక ఆధ్వర్యంలో విద్యార్థులకు కవిత్వం, కథ రాసే విధానంపై శనివారం కార్యశాలను నిర్వహించినట్లు కవి, రచయిత అట్లూరి వెంకటరమణ అన్నారు. తీసుకునే వస్తువు శీర్షిక ప్రకటన పాత్రల మధ్య సంభాషణ ఎలా ఉంటే బావుంటుందో బాల బాలికలకు వివరించామన్నారు. వేదిక జిల్లా కన్వీనర్ కోంద్రు బ్రహ్మం, హెచ్ఎం నాగేందర్, ఉపాధ్యాయులు లూర్దుమేరీ, శ్రీదేవి పాల్గొన్నారు.

పరిశుభ్రతపై అవగాహన

ఖమ్మం సహకారనగర్: నగరంలోని ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాల జువాలజీ విభాగం ఆధ్వర్యంలో కళాశాలలో పరిసరాల పరిశుభ్రతపై శనివారం ఫ్లకార్డులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జువాలజీ విభాగాధిపతి సునంద, వైస్ ప్రిన్సిపాల్ రెడ్డి, రమా సత్యవతి, శ్రీనివాస్, శ్రీమాన్ పాల్గొన్నారు.

శ్రద్ధగా చదువుకోవాలి

ఖమ్మం సహకారనగర్: విద్యార్థులు శ్రద్ధగా చదువుకోవాలని కార్పొరేటర్ శ్రావణి సుధాకర్, అర్బన్ ఎంఈఓ బి.రాములు అన్నారు. శనివారం నగరంలోని వేణుగోపాల్‌నగర్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు మన ఊరు మన బడి, మన బస్తీ మన బడి కార్యక్రమంలో భాగంగా పాఠశాలకు బల్లలు రాగా వాటిని ప్రారంభించారు. హెచ్ఎం గుడిపుడి శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు హైమ పాల్గొన్నారు.

మురుగు తొలగింపు

నేలకొండపల్లి: మండలంలోని రాజేశ్వరపురం పంచాయతీలోని డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల చుట్టూ మురుగు నీరు చేరి కంపుకొడుతుండగా మాజీ సర్పంచ్ దండా పుల్లయ్య శనివారం మురుగును తొలగించి, పెరిగిన కంప చెట్లు నరికించారు. కాలనీ వాసులు కృతజ్ఞతలు తెలిపారు.

నగరంలో సినిమాలు

తిరుమల	డిమాంట్ కాలనీ 2
వినోద	ఆయ్
సాయిరాం	తంగలాన్
ఆదిత్య	మారుతి నగర్ సుబ్రహ్మణ్యం, కమిటీ కుర్రోళ్లు
శ్రీనివాస/ సినీ గెలాక్సీ	డబుల్ ఇస్మార్ట్

- ఖమ్మం గాంధీచౌక్

ఊరు కాచే ముత్తయిదా..



పూజలందుకుంటున్న అమ్మవారు



రెడ్డిపల్లిలోని మారెమ్మతల్లి ఆలయం

భక్తుల కొంగుబంగారంగా మారెమ్మతల్లి

- దినదినాభివృద్ధిలో ఆలయం
- గురు, ఆదివారాల్లో జాతర
- వివాహాది శుభకార్యాలు, వాహన పూజలకు మరింత ప్రత్యేకం
- 50కి పైగా ఫంక్షన్‌హాళ్లు

సండే స్పెషల్

ఖమ్మంరూరల్: కోరిన కోర్కెలు తీర్చే మారెమ్మతల్లి నేడు భక్తులకు కొంగుబంగారంగా నిలిచి విరాజిల్లుతోంది. మండలంలోని రెడ్డిపల్లిలో ఖమ్మం మహబూబాబాద్ ప్రధాన రహదారి పక్కన వేంచేసి ఉన్న అమ్మవారి దర్శనం కోసం భక్తులు ఖమ్మం జిల్లాతో పాటు, ఉమ్మడి వరంగల్, నల్గొండ, హైదరాబాద్ జిల్లాల నుంచి తరలివచ్చి తమ మొక్కులు తీర్చుకుంటారు.

1999లో దేవాదాయశాఖ పరిధిలోకి..

భక్తుల సంఖ్య పెరగడం ఆదాయం కూడా వస్తుండటంతో 1999లో ఆలయం ప్రభుత్వ పరిధిలోని దేవాదాయశాఖ పరిధిలోకి వచ్చింది. అప్పటి వరకు శాశ్వత ఆలయ నిర్మాణం లేకపోవడంతో 2001లో నూతన ఆలయ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపగా మంజూరైంది. అనంతరం 2007లో నూతన ఆలయం నిర్మాణం పూర్తి చేశారు. అప్పుడే నూతనంగా అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు.

ఫంక్షన్‌హాళ్లకు భలే గిరాకీ...



ఆలయ పరిసరాల్లో దుకాణాలు, ఫంక్షన్ హాళ్లు

ఆలయానికి దగ్గరలో 50 వరకు ఫంక్షన్‌హాళ్లు భక్తులకు అందుబాటులో ఉన్నాయి. ఇక్కడ భక్తుల అవసరాన్ని బట్టి ఫంక్షన్‌హాళ్ల యజమానులు డబ్బులు తీసుకుంటారు. ఒక్కో ఫంక్షన్ హాల్ కనీసం రూ.5 వేలకు తక్కువ కాకుండా రూ.20వేల వరకు వసూలు చేస్తుంటారు. అదే విధంగా భక్తుల కోసం పలు రకాల దుకాణాలు కూడా వెలిశాయి. ప్రతీ గురు, ఆదివారాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి అమ్మవారిని దర్శించుకుంటారు. మిగతా రోజుల్లో కూడా భక్తుల రాక కొనసాగుతూనే ఉంటుంది.

ఏ పూజయినా ఇక్కడే..

ఇదిలా ఉండగా అమ్మవారి సన్నిధిలో భక్తులు తమ కోర్కెలను తీర్చుకుంటారు. పిల్లలకు పుట్టు వెంట్రుకలు తీయించడం, వివాహాలు, జరిపించడం, ఏ కొత్తవాహనం కొన్నా తప్పనిసరిగా అమ్మవారి వద్ద పూజలు చేయించడం భక్తులు చేస్తుంటారు. సంతానలేమి వాళ్లు తమకు సంతానం కలిగించమని కోరుకుంటే ఏడాది లోపే అమ్మవారు సంతానం ప్రాప్తిస్తుందని భక్తుల గట్టి నమ్మకం. ఇక నూతన వాహనాలు కొంటే ఇక్కడ తప్పకుండా పూజ చేయించిన తర్వాతే వాహనాన్ని బయటకు తీస్తారు.

ఆలయ చరిత్ర..

1970లో తమిళనాడుకు చెందిన సుబ్బరాయన్ అనే గ్రానైట్ వ్యాపారి తమిళనాడులో కొలువబడుచున్న మారెమ్మతల్లి విగ్రహాన్ని ఇక్కడ ఉంచి పూజలు చేసేవారు. అదే విధంగా అక్కడి నుండి తన వెంట వచ్చిన కార్మికులు కూడా ప్రతీ రోజూ గ్రానైట్ క్వారీలో పనిచేయడానికి వెళ్లేటప్పుడు తమ పనిముట్లను అమ్మవారి దగ్గర ఉంచి పూజ చేసి పనికిపోయేవారు. అప్పటికీ సరైన రోడ్డు సౌకర్యం లేకపోవడం, అక్కడ కనీసం ఎవరూ నివాసం ఉండేవారు కాదు. ముత్తగూడెం గ్రామానికి చెందిన రైతుల పొలాలు మాత్రమే ఇక్కడ ఉండేవి. అక్కడి రైతులు వ్యవసాయం చేసుకొనేవారు. రోజూ వచ్చి పొలం పనులు చేసుకుని రెండు కిలోమీటర్లు నడిచి వెళ్లడం దూరభారం, కష్టతరం కావడంతో కొందరు ఇక్కడే నివాసం ఏర్పర్చుకుని రెడ్డిపల్లి అనే పేరు పెట్టుకొని జీవనం కొనసాగిస్తున్నారు. అలా మొదలైన అమ్మవారికి పూజలు క్రమక్రమంగా దినదినం భక్తుల రాక పెరిగి నేడు పెద్ద ఎత్తున నాలుగు జిల్లాల నుండి భక్తులు వచ్చి మొక్కులు తీర్చుకుంటున్నారు.

కోర్కెలు తీర్చే తల్లి



కోరిన కోర్కెలు తీర్చే అమ్మ మారెమ్మతల్లి. భక్తులుఅనుకున్నవన్నీ కాగానే తిరిగి అమ్మవారి దర్శనానికి వస్తుంటారు. అమ్మకు పొంగలి నైవేద్యం సమర్పిస్తారు. గురు, ఆదివారాల్లో భక్తుల సందడి బాగా ఉంటుంది.

– కాశావఝ్జల రామశర్మ, ఆలయ ప్రధాన అర్చకులు

ప్రతీ ఆదివారం దర్శించుకుంటా..



అమ్మవారిని దర్శించుకోవడం మహాభాగ్యం. కోరిన కోర్కెలు తీర్చే అమ్మవారి మహిమకు అంతులేదు. అమ్మవారిని దర్శించుకుంటే ఆ తృప్తే వేరు. ప్రతీ ఆదివారం వచ్చి అమ్మవారిని కుటుంబ సమేతంగా దర్శించుకుంటాం.

– మమత, భక్తురాలు, ఖమ్మం

మహిమ మాటల్లో చెప్పలేనిది



అమ్మను దర్శించుకుంటే మనస్సు ప్రశాంతంగా ఉంటుంది. అమ్మ మహిమ మాటల్లో చెప్పలేనిది. వారం వారం తప్పక వచ్చి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి నైవేద్యం సమర్పించుకుంటాం.

– రేఖ, భక్తురాలు, ఖమ్మం

ఇది ప్రజా భరోసా ప్రభుత్వం..



లబ్ధిదారులతో మేయర్ నీరజ

ఖమ్మంవన్‌టౌన్: ప్రజా సమస్యలన్నింటినీ కాంగ్రెస్ ప్రభుత్వం తీరుస్తుందని, ఇది ప్రజాభరోసా ప్రభుత్వం అని నగర మేయర్ పునుకొల్లు నీరజ అన్నారు. శనివారం రాష్ట్ర వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచనల మేరకు 35,36 డివిజన్లలో ఉన్న లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ఏ బ్లాక్ అధ్యక్షుడు ఎర్రం బాలగంగాధర తిలక్, నాయకులు నల్లపు శ్రీనివాస్, నీలం క్రిష్ణ, కల్వకుంట్ల గోపాల్, శంకర్‌నాయక్, బాణాల లక్ష్మణ్, నున్నా మాధవరావు, రమేష్‌గౌడ్, ధనాల రమణ, దివ్య, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు వచ్చేంత వరకు పోరాడుతాం

ఖమ్మం సహకారనగర్: జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు వచ్చేంత వరకు పోరాడుతామని ఖమ్మం ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు గుద్దేటి రమేష్‌బాబు అన్నారు. శనివారం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... 400 మంది జర్నలిస్టుల సొంతింటి కల సాకారం చేసుకునేందుకు రెండు దశాబ్దాలుగా ఎదురుచూస్తున్నారన్నారు. ఈ సమావేశంలో నాయకులు రామిశెట్టి విజేత, టీఎస్ చక్రవర్తి, నాగయ్య, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రమేష్‌బాబు

కష్టపడి చదివితే లక్ష్య సాధన సులభం



విద్యార్థినులను అభినందిస్తున్న యాజమాన్యం

ఖమ్మంరూరల్: ఏకాగ్రతతో, చదువుపై శ్రద్ధ ఉంచి కష్టపడి చదివితే అనుకున్న లక్ష్యాలు సాధించడం సులభమని ప్రియదర్శిని మహిళా ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ కె. నవీన్‌బాబు అన్నారు. జేఎన్‌టీయూహెచ్ విడుదల చేసి ఇంజనీరింగ్ పరీక్షా ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థినులను శనివారం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యతో పాటు అవసరమైన నైపుణ్యాలను నేర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బి.గోపాల్, అకడమిక్ డైరెక్టర్ అట్లూరి. వెంకటరమణ, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యాసంస్థల్లో శ్రీ కృష్ణాష్టమి

పలు పాఠశాలల్లో శ్రీకృష్ణాష్టమి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు గోపిక, కృష్ణుల వేషధారణల్లో అందరిని ఆకట్టుకున్నారు. ఉట్టికొట్టే కార్యక్రమం నిర్వహించారు. – సాక్షి నెట్‌వర్క్



ఖమ్మం సహకారనగర్: రెజొనెన్స్ శ్రీనగర్‌లో..



వికాస్ కిండర్ గార్డెన్‌లో..



టైనిటాట్స్ పాఠశాలలో..



శ్రీ చైతన్య శ్రీవిద్యానికేతన్‌లో..



సర్వజ్ఞ పాఠశాలలో..



గీతాంజలిలో..



ఖమ్మంరూరల్: హార్వెస్ట్ స్ప్రింగ్ లీఫ్ పాఠశాలలో..



ఖమ్మంఅర్బన్: బ్లూమింగ్‌మైండ్స్‌పాఠశాలలో..



తిరుమలాయపాలెం: దమ్మాయిగూడెం శ్రీ సరస్వతీ విద్యాలయంలో..

అవసరమున్న ప్రతీ చోట రోడ్డు

- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



శంకుస్థాపన చేస్తున్న మంత్రి తుమ్మల

ఖమ్మంఅర్బన్: రోడ్లు ప్రగతి సూచికలని, నియోజకవర్గ పరిధిలో అవసరమున్న ప్రతీ చోట రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. శనివారం నగరంలోని 2వ డివిజన్ పాండురంగాపురంలో సీసీ రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నియోజకవర్గంలో వంద శాతం సీసీ రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణానికి చర్యలు చేపడుతున్నామని, నాణ్యతలో రాజీలేకుండా, నిర్ధారిత సమయంలోగా పనులు పూర్తయ్యేలా అధికారులు దృష్టి పెట్టాలన్నారు. కొత్తగా ఇళ్లు నిర్మించుకుంటున్న కాలనీలకు రోడ్డు మార్గాలకు ప్రతిపాదనలు సమర్పించాలని, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టి డ్రెయినేజీలు ఎప్పటికప్పుడు శుభ్రపరుస్తూ, నీటి నిల్వలు లేకుండా చూడాలన్నారు. అనంతరం ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురైన 13వ డివిజన్‌లో ఉంటున్న రిటైర్డ్ ఉద్యోగి మోత్కూరు సత్యనారాయణను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు, నగర మేయర్ పునుకొల్లు నీరజ, కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య, ఖమ్మం అర్బన్ తహసీల్దార్ సిహెచ్.స్వామి, కార్పొరేటర్లు మల్లీదు వెంకటేశ్వర్లు, రాపర్తి శరత్, దుద్దుకూరి వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, నల్లమల వెంకటేశ్వరరావు, మారం కరుణాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి



జ్వరం వచ్చిన చిన్నారితో మాట్లాడుతున్న కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య

ఖమ్మంమయూరిసెంటర్: ఇంటి చుట్టు ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య ప్రజలకు సూచించారు. నగరంలోని 28, 44 డివిజన్లలో డెంగీ కేసులు నమోదైన ప్రాంతాలను కమిషనర్ అధికారులతో కలిసి శనివారం పరిశీలించారు. పారిశుద్ధ్య పనులు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. కేఎంసీలోని నర్సరీని సందర్శించిన కమిషనర్ అక్కడ పెరుగుతున్న మొక్కల వివరాలను అడిగి తెలుసుకున్నారు. రిజిష్టర్లను పరిశీలించి వాటి ప్రకారం మొక్కలు ఉన్నాయా, లేవా అని ఆరా తీశారు.

హెల్ప్‌డెస్క్ పరిశీలన..

కేఎంసీ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన ఎల్ఆర్ఎస్ హెల్ప్‌డెస్క్‌ను కమిషనర్ సందర్శించారు. సిబ్బందితో మాట్లాడి ఎలాంటి సమాచారం అందిస్తున్నారన్న వివరాలను ఆరా తీశారు.

మహిళా శక్తి క్యాంటీన్..

కేఎంసీ కార్యాలయంలో ఏర్పాటు చేయబోతున్న మహిళా శక్తి క్యాంటీన్‌ను కమిషనర్ అభిషేక్ అగస్త్య సందర్శించారు. క్యాంటీన్ ఏర్పాట్లను పరిశీలిస్తామని మెప్మా సిబ్బందికి సమాచారం ఇచ్చినా క్యాంటీన్‌ను తెరవకపోగా, సరైన సమాధానం ఇవ్వకపోవడంతో అక్కడ నుండి వెళ్లారు. అసిస్టెంట్ కమిషనర్ సంపత్‌కుమార్ ఉన్నారు.

పంటల నమోదులో వేగం పెంచాలి



రైతులతో మాట్లాడుతున్న ఏడీఏ సరిత

నేలకొండపల్లి: పంటల నమోదు కార్యక్రమాన్ని వేగంగా చేపట్టాలని కూసుమంచి ఏడీఏ బీ.సరిత ఆదేశించారు. మండలంలోని కట్టుకాచారంలో శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా పంటల నమోదును పరిశీలించి ఏఈఓలకు సూచనలు చేశారు. అనంతరం రుణమాఫీ రాని రైతులతో మాట్లాడి దరఖాస్తు చేసుకుంటే అర్హులకు వర్తిస్తుందని.. ఈ విషయంలో ఆందోళన చెందొద్దని తెలిపారు. ఏఈఓ శిరీష పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం



పూజలు చేస్తున్న గ్రామస్తులు

కామేపల్లి: మండంలోని పండితాపురం గ్రామ శివారులో నూతనంగా నిర్మించిన శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. వేద పండితులు గణపతిబొట్ల మధుసూదన్‌శర్మ ఆధ్వర్యంలో విశేష పూజలు, అభిషేకాలు చేశారు. ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గుడివాడ భిక్షపతి మంగతాయి, సాయి మౌనిక, జక్కంపూడి ఉపేందర్ ప్రమీల, కొమ్ము నాగేశ్వరరావు శిరీష, యర్రనాగుల సతీష్ ఉమారాణి, మాచ్చర్ల చంద్రశేఖర్ రమ్యకృష్ణ, మాజీ సర్పంచ్ మూడ్ కృష్ణప్రసాద్ నాయక్, శ్రీను, వెంకన్న, ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు రావుల హన్మంతరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి గాదె రాంబాబు, వెంకటేశ్వర్లు, గరాజు, నరేష్ పాల్గొన్నారు.

కార్పొరేషన్‌కు నిధులు కేటాయించాలి

నేలకొండపల్లి: మున్నూరుకాపు కార్పొరేషన్‌కు నిధులు కేటాయించాలని సీపీఐ మండల సహాయ కార్యదర్శి మారిశెట్టి వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో మున్నూరు కాపు సంఘం పిలుపు మేరకు శనివారం మౌనదీక్షను నిర్వహించారు. నాయకులు ఆకుల నరేష్, డేగల హరిప్రసాద్, మంకెనపల్లి రాము, డేగల నరసింహారావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బహుజన వీరుడు పాపన్న

ఖమ్మంరూరల్: బహుజన వీరుడు సర్వాయి పాపన్న అని కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బోడపట్ల దర్శన్ అన్నారు. మండలంలోని తెల్దారుపల్లిలో శనివారం జరిగిన అమరుల యాదిలో గీత కార్మికుల చైతన్య యాత్ర ముగింపు సభలో ఆయన మాట్లాడగా కరుణాకర్, ఆలూరి కోటయ్య, పట్టాభి, ఉమామహేశ్వరరావు ఉన్నారు.

హైడ్రా చర్యలు అభినందనీయం

ఖమ్మం మామిళ్లగూడెం: అక్రమార్కులపై హైడ్రా చర్యలు అభినందనీయమని బీఆర్ అంబేడ్కర్ ప్రజా సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు లింగాల రవికుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు హైడ్రా కమిషనర్ ఏవీ.రంగనాథ్ ప్రభుత్వ స్థలాల అక్రమ కట్టడాలపై కూల్చివేతల చర్యలు తీసుకోవటం శుభపరిణామమన్నారు. అక్రమ కట్టడాలను నిర్మించిన వారిపై కేసులు నమోదుచేసి, కట్టడాలను కూల్చి ప్రజా అవసరాలకు వినియోగించుకోవాలని కోరారు.

ఆంక్షలు లేకుండా రుణమాఫీ చేయాలి



మాట్లాడుతున్న నాయకులు

ఖమ్మంమామిళ్లగూడెం: ఇచ్చిన హామీ ప్రకారం ఎలాంటి ఆంక్షలు లేకుండా రూ.2 లక్షలు రుణమాఫీ అమలు చేయాలని అఖిల భారత ప్రగతిశీల రైతుసంఘం అధ్యక్ష, కార్యదర్శులు మలీదు నాగేశ్వరరావు, ఆవుల వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. శనివారం ఖమ్మం రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో జిల్లా కార్యవర్గ సమావేశంలో వారు మాట్లాడుతూ... ఈనెల 28న కలెక్టరేట్ ఎదుట జరిగే నిరసనకు రైతులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. పాశం అప్పారావు, మల్లయ్య, నాగిరెడ్డి, లక్ష్మయ్య, దేవల పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

రోడ్డు కనపడటం లేదు..



రఘునాథపాలెం మండలంలోని వీవీపాలెంలో బొడ్రాయి సెంటర్ మెడికల్‌షాపు పక్కన సీసీ రోడ్డుపైకి చెట్టు పెరిగి రోడ్డు ఉన్నదే కనపడటం లేదని, ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని గ్రామస్తులు వాపోతున్నారు. తక్షణం పెరిగిన చెట్లు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

- రఘునాథపాలెం

ప్రశ్నించాల్సిన అధికారి : శ్రీధర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి, 7093923862